# ఛాందోగ్యం

ఆ లోకం....

ఆ - లోకం: దీనికన్న, అదో "మాఁలోకం."

—చచ్చి చెడి, ఎలాగో అక్కడికి....దిగజారితే! కాదా, ఎగప్రాకితే....

ఈ లోకంలో చావని కావని బ్రతుకంతా పిశాచ, పీడగా అవహిస్తే మరి, అప్పుడు....

ఆ లోకాన్నుంచి....ఏ లోకానికి ఎగ, దిగ....?

ధిక్....అఫ్‌సోస్....

చావంత చచ్చిన చావూ మరొకటిలేదు.

చావు— బ్రతుకులు....

బ్రతకమని యీ జోగాయ్-మాధాయ్ అంతా, వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.

....బ్రతికుండగానే....

—బ్రతకను కదా అనే నిరాశతో, పెళ్ళాం మెళ్ళో పుస్తే—పూసా, భువనేశ్వరంలో ఆ సామి-సన్నిధిని....మీదు కట్టింది.

చచ్చిపోతే....నేను చచ్చినంత ఒట్టు....

నా మీద....నా మీద....ఒట్టే —

అక్కడా, అక్కడా అడ్రస్ తెలియని ప్రియురాళ్ళందరూ....

రాళ్ళకూ, రప్పలకూ, మొక్కుకుంటా రంటావా?

ఒక్కతె ముక్కూ మొగమయినా జ్ఞాపకం లేదు. ఇప్పుడు....నిజం చెప్పొద్దూ —

ఉహూఁ....

ఒప్పుకోను....

అబ్బ! ఒప్పుకోనంటే, ఒప్పుకో సోహో అని, నన్ను ముప్పుతిప్పలూ పెట్టలా, అవాళ....అప్పన్న మేనకోడలు?

అదేనయ్యా....దీం తస్సాదియ్యా,

అప్పటికీ....ఇప్పటికీ ....

మన మగసిరి మీద, ఈ దెబ్బోటు....

అబ్బ!....పో-టు....

....మెత్తహో ఉండేవి కావూ దాని చెంపలు?

....కెంపులు చుట్టూతా, మధ్య మాంచి రవ్వ....ఆ దుద్దుల్లో తళుక్....

—హ....బ్బా—ఎడం డొక్కలో క-ళుక్....మంది.

—మందిచ్చినప్పుడల్లా పుచ్చుకోవాలా, ఏం—

గుచ్చుకుంటుందోయ్....చెన్న కేశవులూ-

ఏపూట కాపూట, పంకజమ్మ చెల్లెలి చూపులు....యుష్మత్ సూదికి....తాతగా-ముత్తాతగా....గుచ్చుకునేవోయ్....

అచ్చాయిగాడి మేనత్తను-కొంచెం కదలేసి, సంగతేమిటో తేల్చవే అని, హెచ్చరించడానికె మనకు ముచ్చెమటలూ పోసినాయ్....

ఆసు పోసినట్టుగా అటూ ఇటూ తచ్చాడి....ఆ పక్క నుంచి ఈ పక్కకూ....యీ....

ఊఁ....యీ పక్కనే పడి ఉండనీయ రేమర్రా....

ఇటు ఒరిగినా....అటు తిరిగినా, మధ్య మీకు ఒరిగేదేముందీ?

మీకు....ఏం ఒరిగిందీ?

నన్ను మరిగిందనుకుని, ఒళ్ళు హూనం చేశాడు కాదూ, సీనయ్య, అమ్మణమ్మను, అవాళ....తెల్లారగట్ట....

ఇవాళ—గడిచేట్టు లేదేం? ఏమో లేకపోతే, ఏం!

...."ఏం రాకపోతే, ఓఁ....యబ్బో! నువ్వు లేకపోతే....నీ తాత,...." అంది కాదూ, అక్కమ్మ ముత్తవతల్లి?

పిల్ల....పసందయింది కదా అని, కొండమీది కోతులన్నీ దింపాను దాని కోసం....

—కోసం....మో....సం—

—నన్ను మోసం చెయ్యకండో అంటూ, ఇంటావిడ రాగాలు సాగించడానికి....ఇంకా ఎంత టైమ్ వుంది?

....ఇల్లూ - బంగారం

దానిల్లు బంగారం కానూ....

"ఇల్లూ వాకిలీ అంటూ కాస్త ఏర్పడితే....మీ పేరు చెప్పుకుంటానండీ" అని బ్రతిమాలుకుంది—పాపం వారిజ:

...."ఇంటి వాసాలు లెఖ్ఖట్టేందుకు, నేనొక్కణ్ణే చాలునటే...." అన్నాను....చిన్నబుచ్చుకుంది....

అలా....నొచ్చుకోవడమే, దానికి అచ్చొచ్చింది.

—మరి పచ్చహో ఉన్నాయేం, బత్తాయీలు?....ఫలంపాటు....

"ఆటూ పోటూ వేళ-అక్కడకాదు, ఇక్కడ ఉందాం రండి!" అని....అది చిలకకు చెప్పినట్టు చెప్పింది....

ఉహూఁ....అంటే ఉహూఁ....

దానికన్న నేను తడిసి ముప్పందుమైనా....

కైనా, నాకు వాడితే, చెవుడు నీకు రావాలేం?—

ఏం సాంబశివుడూ, ఏం చేస్తూందిరా, మీ కన్నమ్మ....

....అన్నెము, పున్నెమే నెరుగనమ్మ....ఛస్, ప్రబంధంలో ఆడది పద్యం పాడకపోతే, ఏం?

ఏం-రోగం?

రోగం?-నాయ్-నాయ్:-అంటే పేదవాళ్ళకు వచ్చే జబ్బు, మనది, వ్యాధి, ఇతి పై జయంతీ....

కాంతిలో నిలువకే....నీ చెక్కులు, కందితే....

అందితే వదిలేవాణ్ణా? దాని యక్కచాటున దాక్కుంటే మాత్రం?

....మాత్ర మింగినా, మంచినీళ్ళు తాగలేను....మా మనోహరా....

తాగలేనూ?—

మీగడ తీసేసి తోడెట్టావా ఏమిటే కీు అమ్మాయిని సింహాచలం?

—లేదు, బాబూ, పక్కింటి నాగేశ్వరికన్న, ఎటు చూసినా, మా చంటిదే కాస్త చిక్కిన....

అందోయ్-అయితేనే రమ్మందోయ్.

ఓయ్ అనకముందే కోయిలను కవ్వించేదోయ్, కొంటెపిల్ల ....

జంట స్వరాలనే వాళ్ళం అప్పలస్వామి కూతుళ్ళను—

అందుకోసం కాదుగాని అవాళ మొత్తానికి రంగారావుకు పళ్ళు రాలినాయ్.

....దొంయ్-మనటమే కాని, అరవిందది అంతా పట్టి బోకరింపని నిమిషంలో తేల్చేశాం కాదూ?

ఆదిలక్ష్మి కళ్ళల్లో అదో మాదిరి అందం....

పందిరి మంచంమీంచి క్రిందికి దింపేట్టున్నారే?....

—బాలీసులాగా వుండేది, గాలిబు మరదలు—

వరదా, మువ్వ గో—పా....లా....

చాలించండోయ్ ఏడుపులూ........చావు, దగ్గిరకు రావడానికి హడలు తూంటేను!

సుబ్బులూ....

మబ్బులు దుబ్బులుగా పుట్టడానికి, ఏమిటా మహత్తర కారణం?

దేశంలో లేస్తే మనకేం పట్టింది?....మనసు లేచిందే రణం....

ప్రణకిణాంకిత....బిగ్గరగా ఆడవాళ్ళ ముందు అనేందుకు వీలులేకుండా, అక్కడ, ఓ బూతు తగలేయకపోతే నేం, జగ్గాయ్?

....ముగ్గు చెరిపేస్తానని బెదిరిస్తే, బుగ్గలు నులిమేసింది కాదూ, అమాంతం... లక్ష్మీకాంతం-

ఎంత భారీ మనిషో, స్వారి చేసినట్టుండేది....ఛాస్....సడీ చప్పుడూ లేకుండా వచ్చి, జాజిపొదను గడ-గడ లాడించేది....

మడిమే గా, కృష్ణుడిలో దక్కిన మానవత్వం....

పాపం నిత్యద్విత్వంగా బ్రతికిన బ్రతుకు....తల్లీ ....

—మన గోడమీద మెసిలే బల్లికి, పిల్లలు ఎందరో? వల్లీ వల్లని మగడైతే... తల్లి ప్రాణం కాదూ? మరి....తల నుంచి తోకకు వస్తుందా?

ఇంఖా పుండుకు రాస్తుంది ఇల్లాలు: మళ్ళా గట్టెక్కితే మాత్రం మర్యాద దక్కిస్తాననే నమ్మకం ఏమిటో?

అమ్మకచెల్ల నాదు మన సమ్మక చెల్లదు....ప్చ్....తంజావూరులో ఏ మూల చూచినా ఇలాగే తిక-మక:

....రకానికో కోరకాన్ని, గికురించె....

సకిమోమూ గ—నా లేనీ....నా....

మనసా వాగబోకే - మళ్ళీ జన్మలో మనకు ఈ రంధి ఎలాగూ తప్పదు—

దుకూల చౌరాయ....నూతన జలధర రుచయే, గోపీ వధూ....టీ....